


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ | ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు | ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

ఆవుల విజయభాస్కర రెడ్డి

ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL　ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి　మంగళవారం 24-05-2022　సంపుటి: 03　సంచిక: 245　పేజీలు: 4　వెల: రూ 3-00


# ఏపీలో ప్రతీ కుటుంబానికి 'ఫ్యామిలీ డాక్టర్'

– డబ్ల్యూఈఎఫ్ సదస్సులో వైఎస్ జగన్



దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో రోజు (సోమవారం) ఫ్యూచర్ ప్రూఫింగ్ హెల్త్ సిస్టమ్స్ అంశంపై మాట్లాడారు. డబ్ల్యూఈఎఫ్ పబ్లిక్ సెషన్‌లో పాల్గొన్న ఆయన ఏపీలో కోవిడ్ నియంత్రణకు తీసుకున్న చర్యలతో పాటు రాష్ట్రంలో వైద్య వ్యవస్థలు ఎలా బలోపేతం చేస్తున్నది వివరించారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం తీరు తెన్నులను వెల్లడించారు. ఏపీలో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా కోవిడ్ నియంత్రణ కార్యాచరణ అమలు చేశాం. 44 ఇళ్లు ఒక యూనిట్‌గా ఇంటింటికి సర్వే చేపట్టాం. ఇందు కోసం ప్రతీ 50 ఇళ్లకు ఒక వలంటీర్ వంతున పని చేశారు. 42 వేల మంది ఆశావర్కర్లు ఇందులో పాలు పంచుకున్నారు. ఇంటింటికి వెళ్లి కోవిడ్ లక్షణాలు కనిపించిన వారిని గుర్తించాం. ప్రత్యేకంగా ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. మెడిసిన్స్ అందించాం. రోగులు అవసరమైన పౌష్టిక ఆహారం అందిస్తూ పకడ్బందీ ప్రణాళిక అమలు చేశాం. అందువల్లే కరోనా మరణాల రేటు ఏపీలో జాతీయ స్థాయి కన్నా చాలా తక్కువగా దేశంలోనే అత్యల్పంగా 0.6 శాతంగా నమోదు అయ్యింది.ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. ఆ తర్వాత ఏవైనా రోగాలు వస్తే వాటికి సరైన సమయంలో వైద్యం అందివ్వడమనేది మరో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలను సెంట్రిక్‌గా చేసుకుని ఏపీలో హెల్త్‌కేర్ సిస్టమ్‌ని రెడీ చేశాం. రాష్ట్రంలో రెండు వేల జనాభా కల్గిన ఒక గ్రామంలో విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశాం. వీటిపైన ప్రతీ 13 వేల జనాభా మండలం యూనిట్‌గా రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పాము. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నలుగురు డాక్టర్లు ఉంటారు. అంటే ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు ఉంటారు. ఈ పీహెచ్‌సీలకు అనుబంధంగా 104 అంబులెన్సులు ఉంటాయి. పీహెచ్‌సీలో ఉన్న డాక్టర్లకు కొన్ని గ్రామాల బాధ్యతలను అప్పగించాం. రోజు విడిచి రోజు ఈ డాక్టర్లు అంబులెన్సుల ద్వారా గ్రామాలకు వెళ్తారు. అక్కడి ప్రజలతో మాట్లాడుతారు... వీరంతా ఆ గ్రామంలోని ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్లుగా మారుతారు. పేరు పెట్టి పిలిచే సాన్నిహిత్యంతోపాటు ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ డాక్టర్లకు తెలుస్తుంది. దీనివల్ల అనారోగ్య సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఏదైనా సమస్యలు వచ్చినా మొగ్గ దశలోనే దానికి చికిత్స అందించే వీలు ఉంటుంది.మండల స్థాయి దాటి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, టీచింగ్ హాస్పటిల్స్ చికిత్స అందిస్తాయి. ప్రతీ పార్లమెంటు యూనిట్‌గా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నాం. ఈ కాలేజీలకు అనుబంధంగా టీచింగ్ కాలేజీలు వస్తాయి. అక్కడ పీజీ స్టూడెంట్స్ ఉంటారు. వీళ్లంతా హెల్త్‌కేర్‌లో భాగమవుతారు. దీని ద్వారా హెల్త్‌కేర్ సిస్టమ్ బలోపేతం అవుతుంది. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా వైద్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. మా ప్రభుత్వం రావడానికి ముందు 11 మెడికల్ కాలేజీలు ఉంటే కొత్తగా 16 మెడికల్ కాలేజీలు మంజూరు చేశాం. ప్రతీ పార్లమెంటు నియోజకవర్గం ఒక యూనిట్‌గా మెడికల్ కాలేజీలు ఉండటం వల్ల అన్ని చోట్ల హెచ్చుతగ్గులు లేకుండా వైద్యవ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇందు కోసం ఇప్పటికే రెండు బిలియన్ డాలర్ల బడ్జెట్ కేటాయించాం. మూడేళ్లలో ఫలితాలు అందుతాయి. ఏపీలో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా కోవిడ్ నియంత్రణ కార్యాచరణ అమలు చేశామని సీఎం జగన్ తెలిపారు.కమ్యూనిటీ హెల్త్ ఇన్సురెన్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్



భారత్ అనే పథకం అమలు చేస్తోంది. ఇందులో వెయ్యికి పైగా అనారోగ్య సమస్యలకు చికిత్స అందిస్తున్నారు. కానీ అంతకంటే మిన్నంగా ఏపీలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తున్నాం. ఇందులో ఏకంగా 2,446 రకాల అనారోగ్య సమస్యలకు చికిత్సలు అందిస్తున్నాం. ఐదు లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం కలిగిన 1.44 కోట్ల కుటుంబాలు ఈ పథకం ద్వారా సేవలు పొందుతున్నారు. గత మూడేళ్లలో 25 లక్షల మందికి ఈ పథకం ద్వారా ఉచితంగా వైద్య సాయం అందించామని సీఎం జగన్ వెల్లడించారు.

# టెక్నాలజీ హబ్‌గా విశాఖపట్నం..

## టెక్ మహీంద్రా సీఈవోతో సీఎం జగన్ చర్చలు



దావోస్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు రెండో రోజు ఏపీ సీఎం జగన్ పలువురు ప్రముఖులతో వరుసగా సమావేశం అవుతున్నారు. రెండో రోజు ఉదయం సెషన్‌లో ఫ్యూచర్ ప్రూఫింగ్ హెల్త్ సిస్టమ్‌పై నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన ఆ తర్వాత దస్సాల్ట్ సిస్టమ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫ్లోరెన్స్ వెర్జలెన్, టెక్ మహీంద్రా సీఈవో సీపీ గుర్నానీలతో భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల పెంపు అంశాలపై ప్రధానంగా చర్చించారు.దస్సాల్ట్ సిస్టమ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫ్లోరెన్స్ వెర్జలెన్‌తో సీఎం జగన్ భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం ఫ్లోరెన్స్ వెర్జలెన్ మాట్లాడుతూ... ఏపీ ముఖ్యమంత్రి జగన్‌తో సానుకూల వాతావరణంలో సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా నైపుణ్యాలను ఎలా అభివృద్ధిచేయాలన్నదానిపై చర్చ జరిగినట్టు తెలిపారు. అదే విధంగా కొత్త తరహా ఇంధనాలపైనా కూడా సమావేశంలో చర్చించామన్నారు. విద్యారంగంలో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు దస్సాల్ట్ ఉత్సాహంగా ఉందని ఆమె తెలిపారు. దావోస్‌లో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్‌కి వచ్చిన టెక్ మహీంద్రా సీఈఓ, ఎండీ సీపీ గుర్నానీతో సీఎం సమావేశం అయ్యారు. ఐటీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ఇక్కడి మానవ వనరుల లభ్యత తదితర అంశాలపై వారు చర్చలు జరిపారు. సమావేశం ముగిసిన తర్వాత సీపీ గుర్నానీ మాట్లాడుతూ.. విశాఖపట్నాన్ని మేజర్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి జగన్ సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ఇక్కడ నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు పెట్టాలని టెక్ మహీంద్రాను సీఎం కోరారని తెలిపారు. దీనికి గాను ఆంధ్రా వర్సిటీతో కలిసి పనిచేయాలని నిర్ణయించినట్టు టెక్ మహీంద్రా చైర్మన్ వెల్లడించారు. మానవ నైపుణ్యాలను పెంచేందుకు, హైఎండ్ టెక్నాలజీపై వచ్చే మూడు నెలల్లో ఆంధ్ర యూనివర్శిటీతో కలిసి ప్రత్యేక పాఠ్యప్రణాళికను రూపొందిస్తామన్నారు అదే విధంగా ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రధాన కేంద్రంగా విశాఖపట్నాన్ని తీర్చిద్దాలనే సంకల్పంతో సీఎం జగన్ ఉన్నట్టు గుర్నానీ వెల్లడించారు. దావోస్‌లో జరుగుతున్న సమావేశాల ద్వారా భారీ ఎత్తున పెట్టుబడులు సాధించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా సదస్సు రెండో రోజు సీఎం పలువురు ప్రముఖులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. జపాన్‌కు చెందిన ప్రముఖ రవాణా సంస్థ మిట్సుయి ఒ.ఎస్.కె.లైన్స్ లిమిటెడ్ సీఈఓ తకేషి హషిమొటోతో సీఎం జగన్ భేటీ కానున్నారు. అదే విధంగా హీరోమోటార్ కార్పొరేషన్ చైర్మన్ ఎండీ పవన్ ముంజల్‌తోనూ జగన్ సమావేశం కానున్నారు. చివరగా ఐబీఎం చైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణతోనూ సీఎం జగన్ చర్చలు జరపనున్నారు. ఇంకా మరింత మంది ప్రముఖులనూ ఆయన కలిసే అవకాశం ఉంది.

# బుద్ధిజంతో ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు చెక్ : ప్రధాని మోదీ




టోక్యో : భారత్ అభివృద్ధి ప్రస్థానంలో జపాన్ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జపాన్‌తో భారత్ అనుబంధం సహకారం, ఆధ్యాత్మికతతో కూడినదని అన్నారు. భారత్, జపాన్ సహజ భాగస్వాములని పేర్కొన్నారు. టోక్యోలో సోమవారం భారత సంతతికి చెందిన వారిని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు.తాను ఎప్పుడు జపాన్ వచ్చినా ఇక్కడి ప్రజలు ఎంతో ప్రేమతో తనను స్వాగతిస్తారని చెప్పారు. భారత్–జపాన్ బంధాన్ని ఇక్కడ నివసిస్తున్న భారత సంతతికి చెందిన మీరు బలోపేతం చేస్తున్నారని ప్రశంసించారు. మీలో చాలా మంది ఎన్నో ఏండ్ల నుంచి జపాన్‌లో నివసిస్తూ ఈ దేశ సంస్కృతిని అలవరుచుకున్నారని అన్నారు. ఇప్పటికి మీలో భారత సంస్కృతి, భాష పట్ల మీ అంకితభావం పెరుగుతున్నదని కితాబిచ్చారు.బుద్ధుడు చూపిన మార్గంలో ప్రపంచం నడవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. హింస, వాతావరణ మార్పుల వంటి ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు బుద్ధిజమే సరైన మార్గదర్శిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి హక్కులను పరిరక్షిస్తున్నామని భారత్‌ను ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థగా మలిచామని అన్నారు. ఇక అంతకుముందు ప్రధాని టోక్యోలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు.

# ఐఏఎస్, ఐపీఎస్ లు వృత్తి ధర్మం నిర్వర్తించకపోవడంతోనే వైసీపీనేతల అరాచకాలు

## మాజీ మంత్రి సోమిరెడ్డి



నెల్లూరు నగర తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి పై జరిగిన దాడిని పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలుగు దేశం పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతిని అయన పరామర్శించారు. సోమిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగర తెలుగుదేశం పార్టీ మహిళాధ్యక్షురాలు రేవతి పై వైసీపీ నాయకులు దాడి చేయించడం సిగ్గు చేటు. తన భర్త కప్పిర శ్రీనివాసులును అన్యాయంగా పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి ఎందుకు పంపడం లేదని రేవతి ప్రశ్నిస్తే కొంత మంది మహిళల చేత ఆమె పై దాడి చేయిస్తారా. వైసీపీ కి చెందిన ఎమ్మెల్యేలు,మాజీ, తాజా మంత్రులు దాడులను ప్రోత్సహించడం... సర్వేపల్లి నుంచి కావలి వరకు జిల్లా అంతటా అధికార వైసీపీ నాయకులు దాడులకు పాల్పడడం ఎంత వరకు న్యాయం. దాడులు చేయమని అధికార పార్టీ నాయకులు వాళ్ళ కార్యకర్తలకు ఏమైన లైసెన్స్ లు ఇచ్చారా...? మహిళ పై దాడి చేసి మీరు పెద్ద ప్రతాపం చూపించినట్లు ఫీల్ అవుతున్నారా...అందుకా రాష్ట్ర ప్రజలు మీకు అధికారం ఇచ్చింది. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో ఇళ్ల స్థలాల పేరుతో భూముల కొనుగోళ్లలో అక్రమాలు ఆ స్థలాల లెవలింగ్ పేరుతో దోపిడీ జరుగుతోంది. జిల్లా ఉన్నతాధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఈ అక్రమాల పై విచారణ చేపట్టాలి. జిల్లా కలెక్టర్ కు ఎమ్మెల్యేలు,మంత్రులను కాదని అక్రమాలను అడ్డుకునే ధైర్యం లేకపోవడం దౌర్భాగ్యమని అన్నారు.ఒక్క నెల్లూరు జిల్లాలోనే పేదల ఇళ్ల స్థలాల పేరుతో వందల కోట్ల రూపాయల అక్రమాలకు అధికార వైసీపీ పార్టీ పాల్పడింది.

# రుషికొండ తవ్వకాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏపీ సర్కార్

ఢిల్లీ: రుషికొండ తవ్వకాలపై ఏపీ సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విశాఖలో రుషికొండ తవ్వకాలపై ఎన్జీటీ ధర్మాసనం స్టే విధించింది. ఎన్జీటీ ఆదేశాలను ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. పర్యావరణ అనుమతులన్నీ పొందిన తర్వాతే.. రుషికొండ తవ్వకాలను చేపట్టినట్లు ఏపీ సర్కార్ పేర్కొంది. పర్యావరణానికి ఎటువంటి హానీ కలగకుండా.. తవ్వకాలు, నిర్మాణాలు చేపడతామని పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం పేర్కొంది. ఎంపీ రఘురామ గతేడాది దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 6న ఎన్జీటీ విచారణ జరిపింది. తవ్వకాలపై అధ్యయనం చేసేందుకు సంయుక్త కమిటీని నియమించింది. నెల రోజుల్లో నివేదిక అందించాలని కమిటీకి ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వుల వరకు ఎలాంటి తవ్వకాలూ జరపరాదని ఎన్జీటీ ఆదేశించింది. త్వరలో రుషికొండ తవ్వకాలపై సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది.

# మంత్రి బొత్సకు ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజు సవాల్

విజయనగరం : మంత్రి బొత్స సత్యనారాయణకు ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజు సవాల్ విసిరారు. నేడు సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ.. ఏపీని అభివృద్ధి చేసింది కేంద్రమేనని పేర్కొన్నారు. ఏపీ అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు వస్తారా? అని సవాల్ విసిరారు. ఏపీలో వైసీపీ సర్కార్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వైసీపీ ప్రభుత్వం.. దోపిడీ ప్రభుత్వమని సోము వీర్రాజు పేర్కొన్నారు. రేషన్ బియ్యంలో ఏపీ రూ.2 పెడితే.. కేంద్రం వాటా రూ.30 అని తెలిపారు. రేషన్ పంపిణీ వాహనాలపై జగన్ ఫొటో ఎలా పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర ప్రజల 40 ఏళ్ల కల విశాఖ రైల్వే జోన్ అని పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్ కల నెరవేర్చిందని ప్రధాని మోదీ అని సోము వీర్రాజు తెలిపారు.



# సంపాదకీయం

మంగళవారం 24-05-2022

## ఓ వైపు ఎండలు... మరో వైపు వానలు


ఉత్తరాదిన భానుడి చండప్రతాపం 50 డిగ్రీల సెంటీగ్రేడ్. అంటే గడచిన 122 ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా ఈ మార్చి, ఏప్రిల్‌లలో ఉష్ణోగ్రత. దక్షిణాదిన బెంగుళూరులో గంటల వ్యవధిలో ఒక్కపెట్టున కురిసిన వర్షంతో వాయు, జల, రసాయన తదితర కారణాలతో ఒక్క 2019లోనే ప్రపంచవ్యాప్తంగా 90 లక్షల మంది మరణించారు. 'లాన్సెట్ ప్లానెటరీ హెల్త్' బుధవారం బయటపెట్టిన ఈ లెక్క ప్రకారం ప్రతి 6 మరణాల్లో ఒకటి కాలుష్య మరణమే. ఈ మొత్తంలో దాదాపు 24 లక్షల చావులు భారత్‌లో సంభవించినవే. ప్రపంచ కాలుష్య మరణాల్లో 66.7 లక్షల ప్రధాన వాటా వాయు కాలుష్యానిది. మన దేశంలోనూ కాలుష్య కోరలకు బలైన 24 లక్షల మందిలో... 16.7 లక్షల మంది పీల్చే గాలే ప్రాణాంతకమైనవారు. ఆ లెక్కన భారత్‌లో వాయు కాలుష్య మరణాల సంఖ్య ప్రపంచంలోని ఏ దేశంలోనూ లేనంత ఎక్కువ. అస్సామ్ సహా ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు, భూపతనాలు. ఎండ, వాన, చలి ? అన్నీ అతిగానే! ఏదైనా అకాలమే!! ఈ శతాబ్దంలో భారత్ ఎదుర్కొంటున్న పెను ముప్పు వాతావరణ సంక్షోభం అని శాస్త్రవేత్తలు మొత్తుకుంటున్నది అందుకే! ప్రపంచ వ్యాప్తం గానూ ప్రధాన సమస్యలు ? వాతావరణ మార్పులు, కాలుష్యమే. ఐక్యరాజ్య సమితి (ఐరాస) తాజా నివేదికలు ఆ మాటే చెబుతున్నాయి. వాతావరణ మార్పునకు ప్రధాన సూచికలైన నాలుగూ (గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత, సముద్ర మట్టంలో పెరుగుదల, మహాసముద్రాల వేడిమి, ఆమ్లీకరణ) గత ఏడాది రికార్డు స్థాయిలో పెరిగాయి. మానవాళి మహా సంక్షోభం దిశగా వెళుతోంద నడానికి ఇదే సాక్ష్యమంటూ ఐరాస ప్రమాద ఘంటిక మోగిస్తోంది. ఒక రకంగా ఐరాస విడుదల చేసిన వాతావరణ రిపోర్ట్ కార్డు ఇది. దీన్ని బట్టి చూస్తే, ఉష్ణోగ్రతను పెంచే గ్రీన్‌హౌస్ వాయువుల స్థాయి ప్రపంచమంతటా 2020లోనూ, ఆ వెంటనే 2021లోనూ పెరుగుతూ పోయింది. పారిశ్రామికీకరణ ముందు రోజులతో పోలిస్తే ఇప్పుడు వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ సాంద్రత ఏకంగా 149 శాతం హెచ్చింది. ఇక, సముద్రమట్టం ఏటా సగటున 4.5 మి.మీ. వంతున పెరుగుతోంది. మహా సముద్రాల ఉష్ణోగ్రత, ఆమ్లీకరణ సైతం ఎక్కువవుతూ వస్తోంది. దీని వల్ల పగడాల దిబ్బలలాంటి నీటిలోని జీవావరణ వ్యవస్థలు, ప్రాణికోటి నాశనమవుతాయి. భారత్‌లోనే కాదు... ప్రపంచమంతటా ఉగ్ర ఉష్ణపవనాలు, తుపానులు, అకాల వర్షాలు, కొన్నిచోట్ల అనావృష్టి, సముద్రమట్టాల పెరుగుదల ఊహించని రీతిలో తరచుగా సంభవిస్తున్నాయి. వీటికి కాలుష్యం, పర్యావరణ మార్పులే కారణమన్నది శాస్త్రవేత్తల విశ్లేషణ. దేశంలో ఇవాళ 63.8 కోట్ల జనాభాకు ఆవాసమైన 75 శాతానికి పైగా జిల్లాలు ఈ విపరీత వాతావరణ మార్పులకు కేంద్రాలట. ఇలాంటి వాతావరణ వైపరీత్యాలు 1970 నుంచి 2019 మధ్య 50 ఏళ్ళలో 20 రెట్లకు పైగా పెరిగాయి. భారతీయ మేధావుల బృందమైన 'కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్' (సీఈఈడబ్లు?య) తన అధ్యయనంలో ఈ సంగతి తేల్చింది. ఇది పైకి కనిపించకుండా శ్రామికశక్తినీ, ఆర్థిక వ్యవస్థనూ కూడా దెబ్బతీస్తున్న విషవలయం. ఏ ఏటికాయేడు పెరుగుతున్న వైపరీత్యాలతో ఇటు పట్నాల్లో, అటు పల్లెల్లో ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. జీవనోపాధి పోతోంది. స్వయంకృతాపరాధమైన వాతావరణ వైపరీత్యాలతో భారీ సామాజిక ఆర్థిక మూల్యం చెల్లిం చాల్సి వస్తోంది. పెరుగుతున్న వేడిమి వల్ల వ్యావసాయిక ఉత్పత్తి క్షీణిస్తోంది. ఏటా 2.5 నుంచి 4.5 శాతం స్థూల జాతీయోత్పత్తిని నష్టపోయే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ఐఎల్ఓ) లెక్క ప్రకారం ఉష్ణతాపంతో తీవ్రంగా దెబ్బతింటున్న దేశాల్లో భారత్ ఒకటి. వేడిమి వల్ల 1995లో దేశంలో 4.3 శాతం పని గంటలు వృథా అయ్యాయి. వచ్చే 2030 నాటికి ఆ వృథా 5.8 శాతానికి చేరుతుందని అంచనా. దేశంలో గోధుమల ధర పెరగడానికీ పరోక్షంగా వాతావరణ మార్పులే కారణం. ఈ వేసవిలో ఉష్ణపవనాలతో 10 నుంచి 15 శాతం గోధుమ పంట నష్టపోయాం. అదే సమ యంలో ప్రపంచ గోధుమల ఎగుమతిలో ప్రధాన పాత్రధారి ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంతో సరఫరా చిక్కుల్లో పడింది. గ్యోధుమ పిండి ఖరీదైపోయి, సామాన్యుల చపాతీలపై దెబ్బ పడింది. ఇలాంటి ఉదాహరణలు అనేకం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నీటి భద్రత పైనా ప్రభావం చూపనున్నాయి. మరి, నీటి లభ్యతను కాపాడుకోవడంలో, నిల్వ చేసుకోవడంలో ఎలాంటి చర్యలు చేపడుతున్నాం? తాత్కాలిక పరిష్కారాలతో సమస్య తీరేది కాదు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు విధానపరమైన మార్పులు తప్పనిసరి. పునర్వినియోగ ఇంధనం దిశగా మళ్ళాలి. వేడిని పెంచే ఏసీలు, కార్ల బదులు గాలి ? వెలుతురు ధారాళంగా వచ్చే ఇళ్ళు, చల్లటి మిద్దెలు, హరితవనాల పెంపకం, అనువైన పౌర రవాణా వ్యవస్థలను ఆశ్రయించాలి. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కీలకం. నిజానికి ప్రతి రాష్ట్రంలో వాతావరణ మార్పును పర్యవేక్షించే సెల్ ఉంది. వాటన్నిటికీ పెద్దగా ప్రధాన మంత్రికి వాతావరణ మార్పుపై సలహాలిచ్చే కౌన్సిల్ కూడా ఉంది. కానీ, 2015 జనవరిలో తొలి సమావేశం తర్వాత మళ్ళీ ఇప్పటి దాకా సదరు కౌన్సిల్ కలిస్తే ఒట్టు. అలాగే, అన్ని రాష్ట్రాల్లోని సెల్స్‌ను కూడా పట్టించుకుంటున్న పాపాన పోలేదు. ప్రకృతి పెనుకేక పెడుతోంది. చెవి ఒగ్గకపోతే ముప్పు మనకీ, మన పిల్లలకే!

## నల్లారి ఆశాకిరణం... ?



తిరుపతి, మే 23, మాజీ సీఎం నల్లారి కిరణ్ కూమార్ రెడ్డి పొలిటికల్ సర్కిల్స్ హాట్ టాపిక్‌గా మారారు. వాయల్పాడు, పీలేరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత 2004-2014లోపల చీఫ్‌విప్, స్పీకర్, ఉమ్మడి ఏపీకి చిట్టచివరి సీఎంగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో జై సమైక్యాంధ్ర పార్టీ పెట్టి దెబ్బతిన్నాక అప్పటి నుంచి సైలెంట్‌గా ఉన్నారు. అయితే 2019 ఎన్నికల ముందు బీజేపీలోకి వెళ్తారని ప్రచారం జరిగినా.. మళ్లీ కాంగ్రెస్ గూటికే చేరారు. కాంగ్రెస్ పార్టీ తిరుపతిలో నిర్వహించిన సభకు మాత్రమే అలా వచ్చి వెళ్లిన కిరణ్ కూమార్ రెడ్డి కీలకమైన ఎన్నికల సమయంలో కనిపించలేదు. ఆపై ఆయన చిరునామా ఎవరికీ తెలియలేదు. కాంగ్రెస్‌లో చేరడమైతే చేరారు కానీ.. పొలిటికల్‌గా మాత్రం యాక్టివ్‌గా లేరు. రఘువీరారెడ్డి ఏపీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో.. కొత్త సారథి కిరణ్ కుమార్‌రెడ్డి అనే ప్రచారం జోరుగా సాగింది. అయితే అవన్నీ రూమర్స్ అనేలా బాధ్యతలు స్వీకరించారు మాజీ మంత్రి శైలజానాథ్.కాంగ్రెస్‌లో ఫుల్ స్పీడ్‌తో పని చేస్తారని అనుకుంటే ఇలా చేరడం.. అలా సైలెంట్ అయిపోవడంతో ఆయన వ్యూహం ఏంటో ఎవరికీ అంతు చిక్కలేదు. మళ్లీ వస్తారా.. రారా లేక.. ఇక శాశ్వతంగా రాజకీయాల్లో రిటైర్మెంట్ ప్రకటిస్తారా అనే చర్చలు జరుగుతున్న తరుణంలో ఢిల్లీలో ఒక్కసారిగా మెరిశారు ఈ లాస్ట్ బాల్ బ్యాట్సమెన్. దీంతో ఆయన అనుచరులు, అభిమానులో మరోసారి ఆశలు చిగురించాయి. గత రెండు, మూడు రోజులుగా చిత్తూరు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారారు కిరణ్‌కుమార్‌రెడ్డి.ఏపీసీసీ చీఫ్ పదవి ఆయనే అని కిరణ్‌కుమార్‌రెడ్డి అనుచరులు సోషల్ మీడియాలో అనుకూలంగా పోస్టులు పెట్టేశారు. అయితే.. అవన్నీ ఫేక్ వార్తలే అని.. కేవలం పార్టీలో సీనియర్ నేతలను ఢిల్లీకి రమ్మంటే వెళ్లారని ప్రచారం జరిగింది. కాంగ్రెస్ చేపట్టే పాదయాత్ర, పీసీసీ చీఫ్ నియామకంపై చర్చించే అవకాశమే లేదన్నది కొందరు సీనియర్ల వాదన. పైగా ఢిల్లీలో సోనియాగాంధీ అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నట్టు వార్తలొచ్చాయి. మాజీ సీఎం సన్నిహితులు సైతం ఆయన రాజకీయంగా ఎలా ముందుకెళ్తారు అనేది చెప్పలేకపోతున్నారట.వాస్తవంగా కిరణ్ కుమార్‌రెడ్డిని టైట్ లిప్ అంటారు. ఎడమ చేత్తో చేసేదాన్ని కుడి చేతికి కూడా తెలియకుండా చేయడం ఆయన స్టయిల్. అలాగే ఆయన సీఎం అయ్యారు కూడా. ఇప్పుడు ఢిల్లీ టూర్ వెనక అలాంటిదేదో పెద్ద ప్లాన్ ఉండి ఉండొచ్చని అంటున్నారు. ఆయన ఎందుకు వెళ్లారు.. ఎందుకు ఉంటున్నారు? ఏం చేయాలనుకుంటున్నారు అనేది ఆయనకు తప్ప ఎవరికీ తెలియదు. ఢిల్లీలో అడుగు పెట్టిన రోజున సొంత పనులు మీద వచ్చానని చెప్పిన కిరణ్ తర్వాత అధినేత అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తూ కనిపించారు. ంఖలో జీవం లేనిపార్టీని లేపడం ఎవరి వల్లా కాదు. ఒకవేళ కిరణ్ దగ్గర అలాంటి ప్లాన్స్ ఏవైనా ఉన్నాయా లేక ంఎఅఅలో చేరి జాతీయ స్థాయి నేతగా రాజకీయ శేష జీవితాన్ని లాగించేద్దాం అనుకుంటున్నారా అనేది తేలడం లేదు.

## వెనుక నుంచి చక్కబెట్టుకొస్తున్న జగన్



విశాఖపట్టణం, మే 23, విశాఖ రాజధాని అని జగన్ మనసులో ఏనాడో కన్ ఫర్మ్ చేసుకున్నారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక ఆరు నెలల తరువాత నిండు సభలో ఆయన దాన్ని చల్లగా ప్రకటించారు. పేరుకు మూడు రాజధానులు అంటున్నా టోటల్ పాలనతో పాటు కంప్లీట్ యాక్టివిటీనే విశాఖకు షిఫ్ట్ చేయాలన్నది జగన్ ఆలోచనగా తెలుస్తోంది. ఇక అసెంబ్లీలో మూడు రాజధానుల బిల్లును చట్టం చేసి కూడా ఏడాది అవుతోంది. న్యాయ స్థానాల్లో ఆ కేసు ఉందిపుడు. దాంతో జగన్ ఏం చేయలేకపోతున్నారు. అయితే బ్యాక్ డోర్ నుంచి తాను చేయాలనుకున్నది చేస్తూ విశాఖలో మెల్లగా కథ నడిపిస్తున్నారు అంటున్నారు.విశాఖ విషయంలో తగ్గేది లేదు అన్నట్లుగానే జగన్ వైఖరి ఉంది. తాజాగా మంత్రి వర్గ సమావేశంలో విశాఖలో టూరిజం ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేశారు. అదే విధంగా విశాఖ నుంచి భోగాపురం దాక బీచ్ ఫ్రంట్ ప్రాజెక్టులను చేపట్టాలని కూడా జగన్ సర్కార్ భావిస్తోంది. ఇక కోస్తా తీరం వెంబడి ఆరు లైన్ల రహదారులను నిర్మించాలని, ఈ ప్రాంతంలో ఉన్న పదకొండు బీచ్ లను గోవా తరహాలో అభివృద్ధి చేయాలని కూడా యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు. తొలి దశలో కొన్ని పనులను చేపట్టడానికి అయిదు వందల కోట్ల రూపాయలను కేటాయించారు.విశాఖను జగన్ పరిపాలనా రాజధానిగా అంటున్నారు. దానికి ఆయన కారణాలు చెబుతున్నా కొందరికి పట్టడంలేదు. దాంతో విశాఖలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తద్వారా అతి పెద్ద ఆర్థిక వనరుగా వైజాగ్ ని చూపించాలన్నది జగన్ ఆలోచనగా ఉందిట. దేశంలో అతి చిన్న రాష్ట్రంగా ఉన్న గోవా కేవలం టూరిజం ద్వారానే వచ్చే ఆదాయంతో సంపన్నంగా ఉంటోంది. విశాఖలో కూడా గోవా తరహా టూరిజం ప్రాజెక్టులను టేకప్ చేయడం ద్వారా తక్కువ టైమ్ లో విశాఖను ఏపీకి గ్రోత్ ఇంజన్ గా మార్చాలి అన్నదే జగన్ టార్గెట్ అని చెబుతున్నారు.విశాఖ నుంచే పాలన చేపట్టాలన్నది జగన్ కల. ఈ విషయంలో న్యాయ వివాదాలు కొలిక్కి రావడంలేదు. అవి ఎపుడు వచ్చినా కూడా అప్పటి నుంచే విశాఖను రాజధానిగా ప్రకటించి మొత్తం అన్నీ అక్కడికి తరలించాలన్నది జగన్ ఆలోచన అంటున్నారు. ఈ లోగా అభివృద్ధి కార్యక్రమాల పేరిట విశాఖను రాజధానికి అనువుగా మార్చేందుకు జగన్ గట్టిగానే కృషి చేస్తున్నారు. రాజధాని అన్న మాట ఎక్కడా అనకుండా అన్ని ప్రాంతాల పాటే ఇక్కడా అభివృద్ధి చేస్తున్నామని చెప్పడమే వైసీపీ సర్కార్ ఉద్దేశ్యం. అయితే విశాఖ ప్రాజెక్టుల వెనక మాత్రం క్యాపిటల్ సిటీ ప్లాన్ ఉందని అంటున్నారు ఏ కొత్త నిర్మాణం ఇక్కడ చేపట్టాలన్నా కూడా కోర్టులో కేసులు వేస్తున్నారు. దాంతో బ్యాక్ డోర్ నుంచే వ్యవహారాన్ని చక్కబెట్టాలన్నది జగన్ వ్యూహంగా ఉందని అంటున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ, వుడాలను ఈ విషయంలో ఎక్కువగా ఇన్వాల్వ్ చేస్తూ డెవలప్మెంట్ ఓరియెంటెడ్ ప్రొగ్రామ్స్ గా వాటికి రంగులు అద్దుతున్నారని టాక్. మరి జగన్ కలల రాజధాని విషయంలో కథ ఎటు వైపు సాగుతుందో చూడాలి.

## రంగంలోకి బొడ్డు భాస్కరరావు వారసులు

రాజమండ్రి, మే 23, తూర్పుగోదావరి జిల్లాలో తనకంటూ.. ప్రత్యేక ముద్ర వేసుకున్న రాజకీయ నేత, డైనమిక్ నాయకుడిగా రాజకీయాల్లో గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు, మూడున్నర దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో తన హవాను చాటుకున్న నేత.. బొడ్డు భాస్కర రామారావు తాజాగా మృతి చెందారు. కరోనా భారిన పడిన ఆయన కాకినాడలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. అయితే.. ఆయన లేకపోయినా.. ఆయన నడిచిన, ఆయన నడిపించిన రాజకీయాలు మాత్రం జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందాయి. బొడ్డు భాస్కర రామారావు ది మూడున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానం. అనపర్తి తాలూకా, పెద్దపూడి మండలం, పెద్దాడకు చెందిన బొడ్డు భాస్కరరామారావుకు రాజకీయ జీవితంలో అనేక ప్రత్యేక సంఘటనలు ఉన్నాయి.దాదాపు 1980కు ముందే పదేళ్లపాటు బొడ్డు భాస్కర రామారావు కాంగ్రెస్‌లో చక్రం తిప్పారు. 1981లో సామర్ల కోట సమితి ప్రెసిడెంట్‌గా ఆయన వ్యవహరించారు. ఈ క్రమంలో అన్నగారు ఎన్టీఆర్ పిలుపు మేరకు అప్పుడు స్థాపించిన టీడీపీలోకి వచ్చారు. ఈ క్రమంలోనే జిల్లా పరిషత్ చైర్మన్‌గా 1984లో విజయం దక్కించుకున్నారు. కాపు, బీసీ వర్గాలు బలంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో కమ్మ వర్గం నుంచి కూడా ఆయన మూడున్నర దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగారు. ఈ క్రమంలోనే తన హవాను పెంచుకుని.. 1994, 1999 ఎన్నికల్లో రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం బొడ్డు భాస్కర రామారావు సాధించారు. ఈ క్రమంలో విప్‌గా ఆయన వ్యవహరించారు.రాజమండ్రి మేయర్ ఎన్నికల్లో నాడు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన చక్రవర్తిని గెలిపించేందుకు (ఆ ఎన్నికల్లో వైసీపీ మేయర్ అభ్యర్థి హర్షకుమార్) బొడ్డు భాస్కర రామారావు చేసిన పోరాటం, చూపిన తెగువ నాడు రాష్ట్ర వ్యాప్తంగా హైలెట్ అయ్యింది. 2009లో పెద్దాపురంలో ఓటమి తర్వాత ఆయన పనైపోయిందనుకున్న సమయంలో అనూహ్యంగా 2013లో టీడీపీ నుంచి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఇలా జిల్లాలో టీడీపీని బలోపేతం చేయడంలోను ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. తర్వాత వైసీపీలోకి చేరిన బొడ్డు భాస్కర రామారావు తన వారసుడిగా.. కుమారుడు బొడ్డు వెంకటరమణ చౌదరిని తెరమీదికి తీసుకువచ్చారు. 2014లో రాజమండ్రి ఎంపీసీటును దక్కించుకున్నారు. అయితే.. ఆ ఎన్నికల్లో వెంకటరమణ చౌదరి మాగంటి మురళీ మోహన్ చేతిలో ఓడిపోయారు. టీడీపీ అధికారంలోకి రావడంతో.. మళ్లీ వైసీపీకి దూరమై.. టీడీపీలోకి చేరుకున్నారు.గత ఎన్నికలకు ముందు పెద్దాపురం టికెట్ ఇవ్వాలంటూ.. పెద్ద రగడే చేశారు. అయితే.. చినరాజప్ప చక్రం తిప్పడంతో చంద్రబాబు బొడ్డును పక్కన పెట్టారు. మరోవైపు 2014లో ఓటమితో ఆయన కుమారుడు వెంకట రమణ చౌదరి.. రాజకీయాలు వదిలేసి.. సాఫ్ట్ వేర్ రంగంలోకి వెళ్లిపోయారు. ఇక, ఆయనకు ఎవరూ వారసులు లేకపోవడంతో ఇప్పుడు ఇక, రాజకీయాలకు బొడ్డు భాస్కర రామారావు కుటుంబం దూరమైపోయినట్టే. కాగా, తూర్పు రాజకీయాల్లో చిరరాజప్ప, ముద్రగడ పద్మనాభం, హర్షకుమార్‌ను ఢీ అంటే ఢీ అనేరీతిలో ఎదుర్కొని మూడున్నర దశాబ్దాల పాటు బొడ్డు భాస్కర రామారావు స్ట్రాంగ్ పిల్లర్‌గా నిలబడ్డారు. ఇప్పుడు కరోనా ఎఫెక్ట్‌తో బొడ్డు భాస్కర రామారావు శకం ముగిసింది.

## ఏడేళ్ల నుంచి ఎదురు చూపులే

ఒంగోలు, మే 23, కరువు తరుముతోంది. ప్రాజెక్టులు, రిజర్వాయర్లన్నీ డెడ్‌స్టోరేజీకి చేరుకోని నీళ్ల కోసం దీనంగా నోరు తెరిచి ఎదురుచూస్తున్నాయి. వీటి పరిధిలోని వేల ఎకరాల ఆయకట్టు భూములు సాగుకు నోచుకోక బీడు భూములుగా మారడంతో అన్నదాతకు పూట గడవటం కష్టంగా మారి కూలీలుగా మారుతున్నారు. గత 7 ఏళ్లుగా ఆయకట్టు భూములు సాగుకు నోచుకోక రైతన్నకు ఈ రిజర్వార్ దన్నుగా నిలవలేకపోతోంది. ఈ ప్రాంతంలో కరువును పారదోలేందుకు స్వాతంత్ర్యానికి పూర్వం అప్పటి బ్రిటీష్ పాలకులు మోపాడు 1906లో రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రారంభించి 1921 నాటికి నిర్మాణాన్ని పూర్తిచేసి నీటిని ఆయకట్టుకు వదిలారు. మీడియం ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన మోపాడు రిజర్వాయర్‌కు ప్రధానంగా నీరుచేరాలంటే కనిగిరి నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలం భైరవకోన అటవీప్రాంతంతో పాటు అదే మండలంలోని పిల్లిపల్లి, బోయమడుగుల గ్రామాల పైతట్టున ఉన్న అటవీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే డొక్కలవాగు, మన్నేరు ద్వారా, పామూరు మండలంలోని వర్షపు నీరు నాచవాగుద్వారా మోపాడు రిజర్వాయర్‌కు నీరు చేరుతుంది.తీవ్ర వర్షాభావ పరిస్థితులతో మండల పరిధిలోని మోపాడు రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీకి చేరుకుంది. మోపాడు రిజర్వాయర్ వర్షాభావ పరిస్థితుల కారణంగా నీరు అడుగంటింది. పూర్తిగా వర్షాధానంపై ఆధారపడిన మోపాడు మీడియం ఇరిగేషన్ రిజర్వాయర్ తొట్టిప్రాతం సుమారు 4,500 ఎకరాలు కాగా పూర్తిస్థాయి నీటి నిల్వసామర్థ్యం 2.1 టీఎంసీలు. రిజర్వాయర్ పరిధిలో 12,719 ఎకరాల సాగు భూమి ఉంది. ప్రకాశం జిల్లా పామూరు మండలంలో 8,174 ఎకరాలు, పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా కొండాపురం మండలంలో 4,545 ఎకరాలు ఉంది.

## కేబినెట్ విస్తరణ తర్వాత రీవెంజ్ పాలిటిక్స్

శ్రీకాకుళం, మే 23, గడిచిన రెండు ఎన్నికలలోనూ వైసీపీకి ఉమ్మడి విజయనగరం జిల్లా ఏజెన్సీలో తిరిగులేని మెజారిటీని అందించారు జనం. ఇప్పుడు సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ సెగ్మెంట్లను కలుపుతూ కొత్తగా మన్యం జిల్లాను ఏర్పాటు చేసింది. జిల్లా వైసీపీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి. ఆ హోదాలో జిల్లా కేంద్రంలో మొదటి సమావేశం ఏర్పాటు చేశారు కూడా. ఈ సందర్భంగా ఫ్లెక్సీలతో నగరాన్ని ముంచేశారు. అంతా కలిసి సాగుతారు అని అనుకుంటున్న తరుణంలో నాయకుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. మాజీ మంత్రి పుష్పశ్రీవాణి ఫ్లెక్సీల్లో మంత్రుల ఫొటోలు లేవట. గతానుభవాలను దృష్టిలో పెట్టుకునే ఇలా చేశారని చెవులు కొరుక్కున్నాయి పార్టీ శ్రేణులు.పార్వతీపురం మన్యం జిల్లా విభజనకు ముందు కాస్తో కూస్తో ఉన్న విభేదాలు.. ప్రస్తుతం తారాస్థాయికి చేరుకున్నాయి. ఇంతకుముందు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మంత్రి బొత్స సత్యనారాయణ అండర్‌లో ఉండేవారనే టాక్ ఉంది. విభేదాలున్నా బయట పడేవి కాదు. తాజాగా ఒకరంటే ఒకరికి పొసగడం లేదు. ఉప ముఖ్యమంత్రిగా ఉండేటప్పుడు పుష్పశ్రీవాణి తమను పట్టించుకోలేదని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అనుచరులు బాహాటంగానే తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. ఇటీవల పార్టీ మీటింగ్ కోసం జోగారావు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు పుష్పశ్రీవాణి ఫొటోలు పెట్టలేదు. సమావేశంలోనూ గ్యాప్ పాటించారట. పుష్పశ్రీవాణి వర్సెస్ జోగారావు వార్ ఇంకా కొనసాగుతోందని కేడర్‌కు అర్థమైపోయింది.డిప్యూటీ సీఎం రాజన్నదొరతోపాటు పాలకొండ ఎమ్మెల్యే కళావతి.. ఎమ్మెల్సీ విక్రంత్ కూడా తమకు ప్రాధాన్యం దక్కడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. తమ మధ్య ఉన్న విభేదాలను నర్మగర్భంగా మీటింగ్‌లో బయట పెట్టేశారు. రాజన్నదొర సైతం సమావేశానికి సహకరించ లేదట. గతంలో రాజన్నదొరని అన్నివిధాలా శ్రీవాణి అవమానించారని.. అందుకే ఇప్పుడు ఆయన కూడా అదే పనిచేస్తున్నారని పార్టీ శ్రేణులు చెవులు కొరుక్కుంటున్నాయి.దీంతో మన్యం జిల్లా వైసీపీలో విభేదాలు మరో రూపంలో బుసలు కొడుతున్నాయని చర్చ జరుగుతోంది. ఎవరికి వారే యమునా తీరు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. వీటిని గమనించిన మంత్రి బొత్స సత్యనారాయణ మరోసారి పెద్దరికం పాత్ర పోషిస్తారని.. అన్నీ చక్కదిద్దుతారని కేడర్ భావిస్తోందట. ఈ లోగా రివెంజ్ పాలిటిక్స్ ఎలాంటి మలుపులు తిరుగుతాయో చూడాలి.

## పాలిటిక్స్‌లో కులాల కుంపట్లు

విజయవాడ, మే 23 చంద్రబాబు రాజకీయానికి పూర్తి అపోజిట్ పాలిటిక్స్ జగన్ చేస్తున్నారు. చంద్రబాబు ఇప్పటిదాకా కులాలను పట్టుకుని రాజకీయం చేస్తూ వచ్చారు. ఒక్కో కులంలో కొంతమందిని అందలం ఎక్కించి మిగిలిన వారిని ఆకట్టుకునే వ్యూహం బాబుది. జగన్ అలా కాదు. కులం మతం వర్గం ప్రాంతం అన్నీ దాటుకుని సంపూర్ణ రాజకీయమే చేస్తున్నారు. ఇక జగన్ అన్ని వయసుల వారినీ ఆకట్టుకునేలా సరికొత్త పథకాలకూ శ్రీకారం చుట్టారు. మహిళలు, యువత ఇలా బలమైన వారిని మరింతగా ప్రోత్సహిస్తున్నారు.తాజా బడ్జెట్ లో అనేక చిత్రాలు ఉన్నాయి. అభివృద్ధి అన్నది పెద్దగా వెతకాల్సిన అవసరం లేదు. రాష్ట్రానికి రెండు లక్షల 30 వేల కోట్ల దాకా ఆదాయం వస్తుందని అంచనా వేసిన ఈ బడ్జెట్ లో అందులో ఎంతో కొంత శాతం ప్రగతి పనులకు కేటాయించారా అంటే పెద్దగా లేదు. కానీ అదే సమయంలో సంక్షేమం పేరిట పప్పు బెల్లాల పందేరం మాత్రం చాలా ధాటీగా చేసేలా సీన్ ఉంది. మొత్తం బడ్జెట్ ని చూస్తే ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నారా అని కూడా అనిపించదు. అలా అందరికీ సర్దేశారు. ఆఖరుకు రేపటి ఓటర్లుగా ఉన్న బాలల కోసం కూడా పథకాలు జగన్ రెడీ చేశారు.బడ్జెట్ అంటే ఇప్పటిదాకా చూసింది మొత్తం రాష్ట్రం ఒక యూనిట్ గా చేసుకుని కేటాయింపులు చేయడం. అయితే ఓట్ల రాజకీయ ముదిరాక ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్స్ వచ్చాయి. ఇపుడు బీసీ సబ్ ప్లాన్ కూడా తీసుకువచ్చారు. ఇక రైతుల కోసం వ్యవసాయ బడ్జెట్ ప్రత్యేకంగా చాలా కాలంగా ఉంది. జగన్ ఏలుబడిలో జెండర్ బడ్జెట్ ఒక స్పెషాలిటీ. అంటే సమాజంలో పురుషులతో పాటు సమానంగా మహిళలూ ఎదగాలని కోరుకుంటూ వారి కోసం బడ్జెట్ లో కేటాయింపులు బాగా చేశారు. అంతే కాదు 18 ఏళ్ల లోపు బాలలు, చిన్నారులకు ఏకంగా 16 వేల కోట్ల రూపాయలు వివిధ పథకాల కోసం కేటాయించి రికార్డే సృష్టించారు అని చెప్పాలి.జగన్ చాలా ముందు చూపుతోనే వ్యవహరిస్తున్నారు అంటున్నారు. ఈనాటి టీనేజర్లు, బాలలూ రేపటి ఓటర్లు, 2024 ఎన్నికల నాటికి వీరిలో చాలా మంది కొత్త ఓటర్లు అవుతారు. అందువల్ల వివిధ పథకాల రూపంలో ఇప్పటి నుంచే వారితో కనెక్షన్ పెట్టుకుంటే ఫ్యూచర్ లో వారు బాగా కలసి వస్తారు అన్నదే జగన్ మాస్టర్ ప్లాన్ అంటున్నారు. దీని బట్టి చూస్తే జగన్ సంక్షేమం అపుడే పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకూ సాగిపోయింది అన్నమాట. ఇందులో వారూ వీరూ అన్న తేడా లేకుండా అర్హతే ప్రమాణంగా చేసుకుని అందరికీ అన్నీ ఇస్తూంటే అదే జగన్ వరస విజయాలకు సోపానంగా మారుతుందని అంచనా వేస్తున్నారు.

## చంద్రబాబు స్పీడ్ లెక్కేంటీ...

కర్నేలు, మే 23,ఉమ్మడి కర్నూలు జిల్లాలో చంద్రబాబు పర్యటన భిన్నంగా జరిగింది. కేడర్ నుంచి వచ్చిన స్పందన చూశాక.. ఏదో ఒకటి నిర్ణయం తీసుకోవాలని అనుకున్నారో ఏమో.. డోన్ టీడీపీ అభ్యర్థిగా సుబ్బారెడ్డి పేరును ప్రకటించేశారు. ఈ స్టేట్‌మెంట్‌పై టీడీపీతోపాటు జనసేన కార్యకర్తలు కూడా ఆశ్చర్యపోయాయట. ఒక్క డోన్‌లోనే కాదు.. చంద్రబాబు తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం చర్చ మొదలైందివచ్చే ఎన్నికల్లో ఏపీలో అధికారంలోకి రావాలని చూస్తున్న చంద్రబాబు.. కొన్ని రోజులుగా పొత్తులపై పదే పదే మాట్లాడుతున్నారు. అందరూ ఏకం కావాలని.. అవసరమైతే త్యాగాలకు సిద్ధమని ఆ మధ్య కాకినాడ పర్యటనలో స్పష్టం చేశారు కూడా. జనసేనతో కలిసి సాగాలని చంద్రబాబు బలంగా ఆకాంక్షిస్తున్నారు. కుప్పం పర్యటనలో ఒక కార్యకర్త అడిగిన ప్రశ్నకు వన్‌సైడ్ లవ్వు అంటూ బదులిచ్చి.. తన మనసులో మాటను బయటపెట్టారు. జనసేనాని పవన్ కల్యాణ్ కూడా పార్టీ ఆవిర్భావ సభలో టీడీపీతో పొత్తుపై క్లారిటీ ఇవ్వకుండానే వైసీపీ వ్యతిరేక ఓటును చీలనివ్వబోనని చెప్పారు. అప్పటి నుంచి టీడీపీ, జనసేన దగ్గరవుతున్నాయని అంతా అనుకుంటున్నారు. పొత్తులపై అధికారిక ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. అయితే జనసేన బీజేపీతో పొత్తులో ఉంది. బీజేపీకి టీడీపీ అంటే పడటం లేదు. దీంతో ఈ మూడు పార్టీల కలయిక సాధ్యమా అనేది ప్రశ్న. ఒకవేళ బీజేపీ కలిసి రాకపోయినా టీడీపీ జనసేన కలిసి సాగుతాయనే ప్రచారం ఉంది. గత స్థానికసంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో పలుచోట్ల టీడీపీ, జనసేన అవగాహనతో పోటీ చేశాయి. వచ్చే ఎన్నికల్లో దానిని రిపీట్ చేయాలని చూస్తున్నాయి కూడా. ఇలాంటి తరుణంలో డోన్ విషయంలో చంద్రబాబు చేసిన ప్రకటన రెండు శిబిరాలను గందరగోళంలో పడేశాయి.పొత్తుల కోసం ఒకవైపు ఆలోచిస్తూనే ఇలా ఏకపక్షంగా రెండేళ్ల ముందే డోన్ టీడీపీ అభ్యర్థిని చంద్రబాబు ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తున్నారట. పొత్తులు కుదిరితే ఎవరు ఎక్కడ పోటీ చేస్తారో చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

# జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యాలయంలో...

**విష నాగుల సంచారం, భయంతో స్థానికులు**

ఒంగోలు స్థానికంగా నగర కార్పోరేషన్ 25వ డివిజన్ పరిధిలోగల బండ్లమిట్ట బొందిలివారి వీధిలో శిధిలావస్థలో ఉన్న ఉమ్మడి పరీక్షల కార్యాలయంలో విషనాగులు సంచారం చేస్తున్నాయి. పది అడుగుల పొడవైన పాములు బుసలు కొడుతు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. స్థానిక ప్రజలు 25వ డివిజన్ మున్సిపల్ కార్పొరేటర్, డిప్యూటి మేయర్ వేమూరి సూర్యనారాయణకు పలు మార్లు కలిసి విన్న వించుకున్నారు, వారు స్పందించి తమ సిబ్బందిని పంపినప్పటికి, వారు పాములు కనపడలేదు అంటూ వెనుతిరిగి వెళ్లిపోవడం జరిగిందని తెలిపారు. గత ఆరేడేళ్లుగా ఆ ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యాలయం మూసివేశారని, ఏ ప్రభుత్వ కార్యక్రమం అక్కడ జరగడం లేదని దాంతో చికటి పడిన సమయంలో అక్కడ పాములతో పాటుగా మందుబాబులు చేరి నానా హంగామా చేస్తూ స్థానికులకు నిద్రాభంగం చేస్తున్నారని, రాత్రిళ్లు ఎవరెవరో అక్కడ తిరగడం చేస్తున్నారని తెలిపారు.అసలే ఎండాకాలం, పిల్లలకు వేసవి సెలవుల్లో వారు ఉదయం సాయంత్రం బయటకు వచ్చి ఆడుకోవాలంటే భయపడి పోవుచున్నారు. పాములు గొడ వసారగ చేసుకొని ప్రక్కనున్న ఇళ్ళలోకి రావడంతో చుట్టు పక్కన ఇళ్ల లో మహిళలు ఆరుబయట పనులు చేసుకోవాలన్నా భయంతో వణుకుచున్నారు. ఉదయం సాయంత్రం చల్లని సమయంలో పాములు ఇబ్బందులు కలిగిస్తున్నాయని బెంబేలెత్తుచున్నారు. చిన్న పిల్లలు ఉంటున్నారు, ఏ క్షణం ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి, వారు భయానికి గురవుతున్నారు. ఇప్పటికే కలెక్టర్ నిర్వహించే స్పందన లో అర్జీ ఇచ్చామని, ఆ కార్యాలయం జిల్లా పరిషత్ వారిదని, లేదులేదు మున్సిపాలిటి వారిదని తాత్సారం చేస్తున్నారని, ఇప్పటికైనా సంభందిత అధికారులు స్పందించి కార్యాలయంలో పెరిగి ఉన్న చెట్లను తొలగించి పాముల నుండి కాపాడాలని వారు కోరుతున్నారు.

# ఎమ్మెల్సీని ఆరెస్టు చేయాలి

**టిడిపి బండారు సత్యనారాయణ**

విశాఖపట్నం మే 23ఎమ్మెల్సీ అనంత బాబు ని సజ్జల రామకృష్ణారెడ్డి రహస్య ప్రాంతంలో ఉంచి డ్రామాలు ఆడిస్తున్నారని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. ఎమ్మెల్సీ అనంత బాబును ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న దళిత నాయకులు కారం శివాజీ, జూపూడి జరిగిన దళితుడి హత్య కోసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దళిత సంఘాల ఉద్యమాన్ని నీరుగార్చే చర్యలు జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ దావోస్ లో ఉండి , సజ్జల రామకృష్ణారెడ్డి తో వ్యవహారం నడిపిస్తున్నారని ఆరోపించారు. రంపచోడవరం ఎమ్మెల్యే ను అమాయకుల్ని చేసి అనంత బాబు అకృత్యాలు చేశారని అన్నారు.

# ఆత్మ విశ్వాసంతో పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయాలి

**ఏబీవిపి గంగాధర మండల అధ్యక్షుడు ఆకాష్ దాసరి**

చొప్పదండి మే 23ఆత్మ విశ్వాసంతో పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయాలని కరీంనగర్ జిల్లా గంగాధర మండల ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏబీవీపీ మండల అధ్యక్షుడు ఆకాష్ దాసరి తెలియ చేశారు.ఈ సందర్భంగా ఆకాష్ దాసరి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు అనగానే ఆందోళన చెందుతున్నారు.కానీ విద్యార్థులు చదువుకున్నది, నేర్చుకున్న విద్యలో ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పరీక్షలు ఆత్మ విశ్వాసంతో ధైర్యంగా ప్రతి ఒక్క విద్యార్థి రాసి మంచి ర్యాంకులు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు రాస్తున్న ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు చెప్పారు.ఈ కార్యక్రమంలో శ్రీను,అక్షయ్,తిరుపతి, శివ, అరవింద్, అజయ్ పలువురు ఏబీవీపీ నాయకులు తదితరులు పాలగొన్నారు.

# తెలంగాణ రైతుల గోస ముఖ్యమంత్రికి కనిపించట్లేదా

రామడుగు మే 23 తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలు ఒకవైపు అరిగోస పడి అష్టకష్టాలు పడుతుంటే తెలంగాణ ముఖ్యమంత్రి దృష్టికి మాత్రం పక్క రాష్ట్రాల రైతుల పై పడిందని రాను రాను రాజు గుర్రం గాడిద అయినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఉన్న రాష్ట్రాన్ని రాష్ట్రంలోని సమస్యలు వదిలి దేశాన్ని ఉద్ధరించడానికి రాజధానికి బయలుదేరడం లో అంతర్యం ఏమిటి తెలంగాణ ప్రజలకి రైతుల కి అర్థం కావట్లేదా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని అమరవీరుల త్యాగాలను విద్యార్థుల బలిదానాన్ని గుర్తించి మిగులు బడ్జెట్ తో రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే తెరాస ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మొట్టమొదటి ప్రభుత్వాన్ని ఏర్పరిచి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడమే కాకుండా రాష్ట్ర రైతాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. రాష్ట్రంలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కుప్పలు కుప్పలుగా ఉంటే కూడా కనీసం కొనలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ ఉంటే ముఖ్యమంత్రి మాత్రం పక్క రాష్ట్రాల రైతులపై ప్రేమ ఒలకబోస్తూ ఉన్నాడు. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారి కనీసం ప్రభుత్వ ఉద్యోగులకి నెల నెల జీతాలు కూడా టైంకి ఇవ్వలేని పరిస్థితికి దిగజారిందని కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్ రైతన్నలకు ఇస్తున్న భరోసా ని చూసి ముఖ్యమంత్రికి దడ తోనే రాజధాని పర్యటన పెట్టుకున్నారని ఇక ఏం చేసినా రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఈ సందర్భంగా జిల్లా బీసీ సెల్ చైర్మన్ పులి అంజనేయులు గౌడ్ పేర్కొన్నారు.

# పేదల ఇంటికే పెండ్లి కట్నం

**కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేద ప్రజలకు వరం**

**కొమరబండలో ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే**

కోదాడ సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ కొమరబండలో ప్రతి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ప్రజలందరిని ఆప్యాయంగా పలకరిస్తూ, బుల్లెట్ బండి పై తిరుగుతూ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని అన్నారు.

# ఏపి లో టిడిపి, బిజెపి పొత్తు ?




అమరావతి మే 23 :ఏపీలో ఎన్నికలు ఇప్పటప్పట్లో లేవు కానీ పొత్తుల విషయంలో మాత్రం తీవ్రాతితీవ్రంగా చర్చలు అయితే సాగుతున్నాయి. దానికి కారణం జనసేన అధినాయకుడు పవన్ కళ్యాణ్ చేస్తున్న కొన్ని కీలకమైన వ్యాఖ్యలు. వైసీపీ వ్యతిరేక ఓట్లను చీలనివ్వమని ఆయన ప్రతిన పూనుతున్న వైఖరి. ఇక అలాగే చంద్రబాబు సైతం వైసీపీని ఢీ కొట్టడానికి అంతా కలవాలని ఇస్తున్న పిలుపులు. వీటి సారాంశం ఏంటి అంటే ఏపీలో 2014 పొత్తులను రిపీట్ చేయాలనే.మరి ఏపీలో ఆ పరిస్థితి ఉందా. అంటే లేదు అని బీజేపీ నేతలు అంటున్నారు. మా మోడీని విమర్శించి వ్యక్తిగతంగా కూడా ఆయన ఫ్యామిలీని టచ్ చేసిన టీడీపీతో పొత్తు ఏంటి అన్నది వారి భావన. ఇక కేంద్రంలో మోడీని గద్దె దించాలంటూ 2019 ఎన్నికల వేళ దేశమంతా తిరిగి ఫుల్ టెన్షన్ పెట్టేసిన బాబుని మోడీ అమిత్ షా అసలు మరచిపోలేదు అని కూడా అంటారు.మొత్తానికి అప్ప అరాటమే అన్నట్లుగా పవన్ కళ్యాణ్ బీజేపీని కూడా ఒప్పిస్తాను అని చెబుతున్నా రాజకీయాలు ఏమీ తెలియకుండా ఆ పార్టీ నేతలు ఉన్నారు అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండబోదు ఇక దానా దీనా తమ నేస్తం పవన్ కోరిక మేరకు టీడీపీతో పొత్తులకు సై అన్నా కొరుడు పడని కండిషన్లు పెట్టడం ద్వారా టీడీపీయే పొత్తు తెంచుకుంది అన్నట్లుగా కథ నడిపేందుకు కూడా బీజేపీ ప్లాన్ బీ సిద్ధం చేసింది అంటున్నారు.అదెలా అంటే ఏపీలో బీజేపీ జనసేనా టీడీపీ కలసి కూటమి కట్టాలీ అంటే మొత్తం 175 సీట్లలో సగం సగం పంచుకోవాలన్నది ఈ కండిషన్. అంటే టీడీపీ సగానికి పోటీ చేస్తే మరో సగానికి జనసేన బీజేపీ పోటీ చెస్తాయి అన్న మాట. అదే విధంగా ఎన్నికల తరువాత ఈ కూటమి గెలిస్తే కచ్చితంగా పవన్ కళ్యాణ్ ని సీఎం చేయాలి. ఈ విధంగా టీడీపీ అంగీకరిస్తేనే తప్ప పొత్తు పెట్టుకోమని బీజేపీ నేతలు అంటున్నారు.అంటే పాము చావకుండా కర్ర విరగకుండా ఈ ప్లాన్ బీ ఉంటుంది అన్న మాట. మరీ ప్లాన్ ఏ ప్రకారం పొత్తులకు మేము దూరం బాబుతో వద్దు అంటే పవన్ కి కోపం వస్తోంది. అలా కాకుండా పవన్ని తమ మిత్రుడిగా ఉంచుకోవడానికి ప్లాన్ బీని బీజేపీ అప్లై చేస్తుంది అని చెబుతున్నారు. ప్లాన్ బీ అంటే పవన్ కి కూడా సంతోషమే కదా. ఎటూ ఎక్కువ సీట్లు వస్తాయి. పైగా సీఎం పోస్ట్ తనకే ఇమ్మని బీజేపీ వారు కోరుతారు. సో ఈ మొత్తం వ్యవహారంలో ఇబ్బంది పడేది కచ్చితంగా టీడీపీనే.అందుకే వారు పొత్తుకు ససేమిరా అంటారు. అలా వారు అనాలన్నదే బీజేపీ ఎత్తుగడ. మొత్తానికి ఏ పవన్ని అయితే ముందు పెట్టి పొత్తు కథ నడుపుతున్న చంద్రబాబును ఎదుర్కోవాలంటే అదే పవన్ని తాము ముందు పెట్టి బాబు నోట వద్దు బాబోయ్ ఈ పొత్తులు అనిపిస్తారు అన్న మాట. చూడాలి మరి ఈ ఎత్తులు పొత్తులు ఏ మేరకు సక్సెస్ అవుతాయో వేచి చూడాలి .

# రైతు బజార్ కు ఎస్టేట్ అధికారిని నియమించాలి.

**దళారుల వ్యవస్థను అరికట్టాలి**

**జాయింట్ కలెక్టర్ ను కలిసిన ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి**



కడప కడప లో రైతు బజార్ లో ఎస్టేట్ ఆఫీసర్ లేకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు అమ్ముతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి సోమవారం స్పందన జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు బజార్ లో ఉదయం 5 నుంచే దళారులు , రైతులు మధ్యనే క్రయ విక్రయాలు జరుగుతున్నాయని ఎస్టేట్ అధికారి లేకపోవడంతో దళారుల తో రైతులు నష్టపోతున్నారు ఆయన తెలిపారు. నోటీస్ బోర్డ్ లో ఉన్న దానికంటే అధిక ధరలు అమ్ముతున్నారని ఎలాంటి చర్యలు తీసుకోలేదని అక్కడ అధికారులు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా దళారులు వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. రైతు బజార్ లో ఇద్దరు మాత్రమే సిబ్బంది ఉన్నారని కనీసం ఐదుగురు సిబ్బంది ఉండాలని ఆయన తెలిపారు. అక్కడ వర్షం వస్తే డ్రైనేజీ నీరంతా రోజుల తరబడి రైతు బజార్ లోనే ఉంటుందని పరిష్కరించే వారే లేరని ఆయన తెలిపారు. ఆర్ ఓ ప్లాంట్ ఉన్న కూడా మంచి నీళ్లు లేవని రైతులకు మంచినీళ్లు ఇవ్వాలని ఆయన తెలిపారు. దొంగతనాలు కూడా జరుగుతున్నాయని అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గతంలో అధికారులకు ఫిర్యాదులు చేసినా కూడా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన కోరారు. నిత్యవసర వస్తువులు వంట నూనెలు ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు అమ్ముకుంటున్నారని ఆయన తెలిపారు.

# విశాఖపట్నంలో వధువు సృజన మృతి పై వీడిన మిస్టరీ...

**పెళ్లికి మూడు రోజుల ముందు అతడితో చాటింగ్**

విశాఖపట్నం విశాఖపట్టణం మధురవాడలో పెళ్లి పీటలపై సృజన అనే వధువు కుప్పకూలి చనిపోయిన ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. అయితే ఆమె మృతిపై రకరకాల వార్తలు ప్రచారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా సృజన మృతికి సంబంధించిన మిస్టరీ వీడింది. పోలీసుల విచారణలో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. సృజనకు శివాజీతో పెళ్లి ఇష్టం లేదని.. పెళ్లిని ఆపేందుకు యత్నించిన క్రమంలో ఆమె ప్రాణాలు కోల్పోయిందని పోలీసులు తెలిపారు. సృజన ఆత్మహత్య చేసుకోవడానికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు తేల్చారు.పరవాడకు చెందిన మోహన్ అనే వ్యక్తితో సృజన ఏడేళ్లుగా ప్రేమ వ్యవహారం సాగిస్తున్నట్టుగా పోలీసులు గుర్తించారు. అయితే సరైన ఉద్యోగం లేకపోవడంతో మోహన్ పెళ్లికి సమయం కోరినట్టుగా తెలిసింది. మరోవైపు సృజనకు కుటుంబ సభ్యులు శివాజీతో పెళ్లి ఫిక్స్ చేశారు. ఈ క్రమంలోనే తనకు ఈ పెళ్లి ఇష్టంలేదని, ఎలాగైనా తనను తీసుకుపోవాలని మోహన్ను సృజన కోరింది. రెండేళ్లు ఆగాలని, ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నానని, మంచి ఉద్యోగం రాగానే తీసుకెళ్తానని మోహన్ సృజనకు తెలిపాడు.ఇక, పెళ్లికి 3 రోజుల ముందు సృజన ప్రియుడితో ఇన్స్టాలో చాటింగ్ చేసినట్టుగా పోలీసులు గుర్తించారు. పెళ్లి ఆపేందుకు ప్రయత్నిస్తానని ఈ సందర్భంగా సృజన ప్రియుడికి చెప్పింది. పెళ్లి ఆపాలనే ప్రయత్నంలో భాగంగా సృజన విషపదార్థం తినింది. అయితే అనుకోని పరిస్థితుల్లో ఆమె పెళ్లీ పీటల మీదే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయింది.అసలేం జరిగింది..హైదరాబాద్కు చెందిన ముజేటి ఈశ్వరరావు, అనురాధ దంపతులు వారి కుమార్తె సృజనకు టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పీఎం పాలెంకు చెందిన నాగోతి శివాజీ(29)తో వివాహం నిశ్చయించారు. అయితే వివాహ వేడుక జరుగుతున్న సమయంలో.. కొన్ని పూజలు పూర్తయిన తర్వాత వధువు తలపై జీలకర్ర, బెల్లం ముక్కలను ఉంచమని పూజారి వరుడికి చెప్పారు. ఆ సమయంలో సృజన ఒక్కసారిగా వివాహ వేదికపై కుప్పకూలింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. సృజన పెళ్లికి సుముఖంగా లేకపోవడంతో ఏదో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానించారు. అనంతరం వధువు బ్యాగులో గన్నేరు పప్పు తొక్కలు లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. అయితే కుటుంబ సభ్యులు వాటిని ఖండించారు. సృజన ఇష్టంతోనే పెళ్లి నిర్ణయం జరిగిందని అన్నారు. పెళ్లికి రెండు రోజులు ముందు నుంచి సృజన అనారోగ్యంతో ఉన్నట్టుగా చెప్పారు. అయితే అన్ని కోణాల్లో విచారణ జరిపిన పోలీసులు.. ప్రేమ వ్యవహారంతోనే సృజన పెళ్లినే ఆపే యత్నంలో ప్రాణాలు కోల్పోయిందని తేల్చారు.

# కళాకారులకు కడప జిల్లా పుట్టినిల్లు

**మహాసభలు, కళా ఉత్సవాలను విజయవంతం చేయండి**

**మహాసభల పోస్టర్లను ఆవిష్కరించిన డిప్యూటీ సిఎం అంజాద్ భాషా**

కడప కళాకారులకు పుట్టినిల్లు కడప జిల్లా అని, ఈనెల 25 నుండి 31వరకు కడప నగరంలో జరిగే ప్రజానాట్యమండలి రాష్ట్ర స్థాయి మహాసభలు, కళా ఉత్సవాలును విజయవంతం చేయాలని మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, డిప్యూటీ సీఎం యస్ బి.అంజాద్ భాష పేర్కొన్నారు.సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభల పోస్టర్లను డిప్యూటి సీఎం అంజాద్ భాష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజాద్ భాష మాట్లాడుతూ కడపలో నగరంలో జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలకు, కళా ఉత్సవాలకు విచ్చేస్తున్న గ్రామీణ కళాకారులు మొదలు సినిమా రంగానికి చెందిన కళాకారుల వరకు అందరికీ హృదయపూర్వక ఆహ్వానం పలుకుతున్నామన్నారు. కవులకు, కళాకారులకు, రచయిత లకు,కళలకు కాణాచి అయిన వైఎస్ఆర్ కడప జిల్లాలో రాష్ట్రస్థాయి ప్రజానాట్యమండలి కళా ఉత్సవాలు, మహాసభలు జరుపుకోవడం సంతోషక రమన్నారు. జిల్లా, నగర ప్రజానీకం ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఆహ్వాన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కడప అంటే హత్యలు, హత్యా రాజకీయాలు, బాంబులు అనే విధంగా, వీరికెందుకు అభివృద్ధి అని చాలామంది మాట్లాడు తున్నారన్నారు. అన్నింటా కార్పొరేట్ విష సంస్కృతి విలయ తాండవం చేస్తూ మనిషి ని మాయ చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాకళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ,కార్పొరేట్ సంస్కృతి ప్రత్యామ్నాయంగా ప్రజా కళలను తీర్చిదిద్దుకోవాల్సిన తక్షణ అవసరం మన ముందున్నదన్నారు. ఇలాంటి తరుణంలో మొట్టమొదటిసారిగా కడప నగరంలో నిర్వహిస్తున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలు, కళా ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. కృష్ణమూర్తి, ఎల్ నాగ సుబ్బారెడ్డి, నగర కార్యదర్శి యన్. వెంకట శివ, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి జి మద్దిలేటి, ఏఐవైఎఫ్ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నము పరబ్రహ్మ స్వరూపం

**నగరంలో 20 కమ్యూనిటీ ఫ్రిడ్జిలు ఏర్పాటు**

**ఆహారం వృధా చేయకండి.. అన్నార్తులను ఆదుకోండి**

అల్లిపురం... మే 23 అన్నము పరబ్రహ్మ స్వరూపమని కాబట్టి ఏ ఒక్కరూ కూడా ఆహారాన్ని వృధా చేయరాదనీ కె ఎన్ అర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కందుల నాగరాజు పిలుపునిచ్చారు.. సోమవారం అల్లిపురం ప్రాంగణంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఫ్రిడ్జ ఏర్పాటు చేశారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కందుల నాగరాజు పాల్గొని మాట్లాడుతూ నగరంలోని 20 ప్రాంతాల్లో ఈ కమ్యూనిటీ ఫ్రిడ్జ లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.. కాబట్టి ప్రతి ఒక్కరూ మిగిలిన ఆహార పదార్థాలను తమకు అందుబాటులో ఉన్న ఫ్రిడ్జ లలో ఉంచినట్లయితేఅన్నార్తులకు అవి ఉపయోగపడతాయన్నారు.. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ,జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజంతా శ్రమించేది అన్నం కోసమే అన్నారు.. ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమకు అందుబాటులో ఉన్న కమ్యూనిటీ ఫ్రిడ్జ లకు అందించినట్లయితే అది వేరే వారికి ఉపయోగకరం అవుతుందన్నారు., ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహణకు సహకరించిన అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ను శ్రీను బాబు అభినందించారు.. పలు ప్రాంతాల్లో స్వచ్ఛందంగా చలివేంద్రం లు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు,, తమ పరిధిలో కూడా కొన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీను బాబుచెప్పారు.. ఈ సందర్భంగా పలువురు కి ఆహారాన్ని ఉచితంగా అందజేశారు, ఈ కార్యక్రమంలో వాసవి ఇంటర్నేషనల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం. రాంజీఅంతర్జాతీయ ఉపాధ్యక్షులు కొల్లూరు కామ రాజు,కేఎన్నార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నలిని, బద్రీనాథ్ కేదార్నాథ్,, దుర్గా కుమారి, సత్తిబాబు ,మల్లేష్ , అప్పారావు,జానకి ,సాజన్ ,,విజయ తదితరులు పాల్గొన్నారు

# వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు పోలీసుల ఎదుట లొంగుబాటు?

కాకినాడ మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. కాకినాడ పోలీసులు ఆయన్ను విచారిస్తున్నట్లు సమాచారం. సుబ్రహ్మణ్యం మృతిపై ఇప్పటికే పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. ఈ కేసులో ఎమ్మెల్సీ అనంతబాబును వెంటనే అరెస్ట్ చేయాలని దళిత, ప్రజాసంఘాలతో పాటు వివిధ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసుల ఎదుట ఎమ్మెల్సీ లొంగిపోయినట్లు వార్తలు వస్తున్నాయి.

# బాపట్లలో బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య





బాపట్ల బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ బలవన్మరణానికి పాల్పడిన ఘటన బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలంలో చోటుచేసుకుంది. తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన బొల్లి దివ్యవాణి (31) నగరం మండలం మట్లాపూడిలోని ఇండియన్ బ్యాంక్లో అసిస్టెంట్ మేనేజర్గా పనిచేస్తోంది. ఐదేళ్లుగా ఇదే ప్రాంతంలో పలు బ్రాంచీల్లో పనిచేసిన దివ్యవాణి ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడ్డారు. చెరుకుపల్లి ఎస్సై డి.వెంకటకొండారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం, సిరిసిల్లకు చెందిన బొల్లి దివ్యవాణి (31) నగరం మండలం, మట్లాపూడిలోని ఇండియన్ బ్యాంక్లో అసిస్టెంట్ మేనేజర్గా పనిచేసేవారు. ఐదేళ్లుగా ఆమె నగరం, అక్కడి నుంచి మట్లపూడి ఇండియన్ బ్యాంక్ శాఖల్లో పనిచేస్తూ బ్యాంకు నుంచి రూ.40లక్షల రుణం తీసుకున్నారు. ఆ రుణంతో గుళ్లపల్లిలో మూడంతస్తుల భవనం నిర్మించుకుని ఉప్పాల శ్రీనివాసరావుకు అద్దెకు ఇచ్చారు. అందులోనే ఒక గదిలో ఆమె నివసించేవారు.బ్యాంకులో పనిఒత్తిడి కారణంగా ఇబ్బందిగా ఉంటోందని ఇటీవల ఇంటికి వెళ్లినప్పుడు తల్లిదండ్రులకు తెలపగా వారు ఆమెను సముదాయించి పంపారు. దీనికి తోడు ఆర్థిక సమస్యలు మరింత ఇబ్బందికి గురిచేశాయి. శనివారం విధులు ముగించుకుని బ్యాంకు నుంచి వచ్చి తన గదిలో నిద్రించింది. ఆదివారం ఉదయం అద్దెకు ఉంటున్న శ్రీనివాసరావు చూసే సమయానికి ఓ గదిలో సీలింగ్కు చున్నీతో ఉరివేసుకొని కనిపించింది.వెంటనే విషయాన్ని పోలీసులకు అందజేసారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు సాయంత్రానికి గుళ్లపల్లి చేరుకుని కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. తమ కుమార్తె పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లి విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న వారికి 5 వారాల వేతనాలను వెంటనే చెల్లించాలి:సీపీఐ



డోన్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పని చేసినటువంటి 5 వారాలు వేతనాలు వెంటనే వారి అకౌంట్ల జమ చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మికులు రోజు పనికి పోతే తప్ప పూటగడవని పరిస్థితుల్లో ఉన్నారు చాలా ఇబ్బందులు పడుతున్నారు వారి అకౌంట్లకు జమ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తరఫున డోన్ ఆర్ డి ఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం లో నంద్యాల జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగినది ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి నారాయణ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటా రాముడు పృథ్వీ కుమార్ రాజు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ ఉపాధి హామీని నిర్వీర్యం చేయడానికి కి కుట్రలు చేస్తున్నది అందులో భాగంగానే 2022-2023 యూనియన్ బడ్జెట్ లో చట్టానికి భారీగా నిధులు కోత విధించింది అడిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించడంలో విఫలమైనది మోడీ పేదలకు ఇచ్చిన హామీ నీ నిలబెట్టుకోలేదు పేదలను నిట్ట నిలువునా మోసం చేయడం జరిగినది ఈ నేపథ్యంలో మోడీ కుట్రలకు వ్యతిరేకంగా ఉపాధి హామీ చట్టాన్ని రక్షించు కోవాలని కేంద్ర బడ్జెట్ లో రెండు లక్షల 40 వేల కోట్లు రూపాయలను కేటాయించాలని జాబ్ కార్డు నిమిత్తం లేకుండా జాబ్ కార్డు కలిగిన ప్రతి వయోజన కి 200 రోజులు పని కల్పించాలని రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలనిఉపాధి హామీ లో పనిచేసే కూలీలకు రెండుపూటలా పనిఢ అనే నిబంధనలు తొలగించాలనిఉపాధి హామీలో పని చేసినటువంటి కూలీలకు వెంటనే చెల్లించాలని సీపీఐ నాయకులు కోరుతున్నారు

## బద్వేలు ఆర్ డి ఓ కార్యాలయానికి బాధితుల తాకిడి

బద్వేలు ఉదయం ప్రతినిధిబద్వేల్ ఆర్ డి ఓ కార్యాలయానికి బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు బాధితుల తాకిడితో కార్యాలయం కిటకిట లాడింది సోమవారం కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తుంటారు స్పందన కార్యక్రమం లో బాధితులు వినతులు ఇస్తుంటారు అలాగే సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాలకు చెందిన బాధితులు భారీ సంఖ్యలో కార్యాలయానికి రావడం జరిగింది

## స్పందన అర్జీలను క్షేత్రస్థాయిలో సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్

నంద్యాల :- ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి అర్జీని పరిశీలించి నాణ్యతతో నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం డోన్ ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు డిఆర్ఓ పుల్లయ్య, ఆర్డీఓ కె.వెంకరెడ్డి తదితరులు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ స్పందన ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును తేలికగా తీసుకోకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఈ మేరకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఆదేశాలననుసరించి. అర్జీదారుని సమస్యకు ముందు క్షేత్రస్థాయిలో పర్యటించిన ఫోటో, పరిష్కరించిన అనంతరం తీసిన ఫోటోగ్రాఫ్స్ పరిష్కార నివేదికలతో సహా కలెక్టరేట్ కార్యాలయానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులకు మరింత దగ్గరగా వెళితే సమస్యలకు ఖచ్చితమైన పరిష్కారం లభిస్తుందన్నారు. దీర్ఘకాలికంగా గత కొన్ని ఏళ్ల నుండి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్పందనలో అధికంగా వస్తుంటాయని రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు గైకొని డిస్పోజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వారం స్పందనలో 150 కి పైగా దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో ప్రతి అర్జీకి అస్పష్ట ముగింపు కాకుండా ఖచ్చితమైన పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో సరైన కారణాలు వివరిస్తూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఎండార్స్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైతే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయో ఆయా సమస్యలు పరిష్కరించేందుకు క్రింది స్థాయి సిబ్బందిని పురమాయించి విసుగు చెందకుండా అధికారులు కృషి చేయాలన్నారు. టాప్ 4 సర్వీసులలో రేషన్ కార్డులు, పెన్షన్ కు సంబంధించిన పెండింగ్ అంశాలు, టాప్ 10 సర్వీసెస్లో పెండింగ్లో వున్న ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల అంశాలను పరిష్కరించి క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.స్పందన అర్జీలను సరైన రీతిలో పరిష్కరించకపోవడం వల్లే ఇంకా 77 దరఖాస్తులు రీఓపెన్ అయ్యాయని పెండింగ్లో వున్న రీఓపెన్ దరఖాస్తులన్నింటికీ నోటీసులిచ్చి డిస్పోజ్ చేయకుండా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే 24 గంటల నుండి 48 గంటల లోపు ఉన్న దరఖాస్తులు ఏడు పెండింగ్లో ఉన్నాయని వీటిని కూడా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వార్తాపత్రికల్లో ప్రచురితమయ్యే వ్యతిరేక వార్తలు రెడీమేడ్ గా అధికారుల దృష్టికి వస్తుంటాయని వాటిపై కూడా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించి యాక్షన్ టెక్ అండ్ రిపోర్ట్ లు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. డోన్ పట్టణం నివాసితురాలు రాజమ్మ తన వ్యవసాయ భూమి సర్వే నంబర్ 164 లో 1.47 సెంట్ల భూమి గ్రామ రెవెన్యూలో ఉందని... ప్రస్తుతం మా



భూమి ఈ సర్వే నంబర్ లేదు మరో సర్వే నంబర్ లో ఉందని రెవెన్యూ అధికారులు సంబంధంలేని సమాధానం ఇస్తున్నారని దయతో నాకు న్యాయం చేయగలరని కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు. డోన్ మండలం ధర్మవరం గ్రామపంచాయతీ కోట్ల వారి పల్లి గ్రామ నివాసి మధు శేఖర్ నాయుడు సర్వే నంబర్ 562 లో 3.30 సెంట్ల భూమి కలదని సదరు భూమిలో కొత్త విస్తీర్ణాన్ని రజకులకు, హరిజనులకు ప్లాట్లు వేసుకోమని రెవెన్యూ అధికారులు కట్టబెట్టాలని చూస్తున్నారని తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ కు అర్జీ సమర్పించుకున్నారు3) డోన్ మండలం కొత్తకోట గ్రామానికి సంబంధించి115/1ఎ గల వ్యవసాయ భూమి ఆన్లైన్ నమోదుకు మూడుసార్లు కొలిపించి దాదాపు అయిదు సార్లు మ్యుటేషన్ కమ్ ఈపాస్ బుక్ అప్లై చేసి వున్నామని మా డాక్యుమెంట్లు పరిశీలించి తగు న్యాయం చేయగలరని కోరుతూ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.


## పోలీసు " స్పందన " కు 71 ఫిర్యాదులు

నంద్యాల ఉదయం న్యూస్ :- నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్దగల పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 71 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారులతో జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి ఐపి యస్ నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓంకారం దేవస్థానం వారు వచ్చిన ఫిర్యాదిదారులకు భోజన వసతులు ఏర్పాటు చేశారు. 1) 2003లో పాత మిద్దె ఖాళీ స్థలం కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను కానీ ఇంటి పక్కన ఉన్న బొమ్మన రామలింగారెడ్డి నేను కొన్న ఇంటి పారు లో మాకు భాగం ఉందని మిద్దె కట్టకుండా నిలుపుదల చేసినారు అని న్యాయం చెయ్యండి అని వాడాల గ్రామానికి చెందిన టి . వెంకటరమణారెడ్డి ఫిర్యాదు చేశారు. 2) గుర్రప్ప అను వ్యక్తి డబ్బులు అప్పుగా తీసుకుని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదని తనకు న్యాయం చేయాలని పెద్దకంబలూరు గ్రామానికి చెందిన వై.యేసయ్య ఫిర్యాదు చేశారు

## ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన... బైరెడ్డి సిద్దార్థ రెడ్డి

పగిడ్యాల (మే:24) నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం లోని పగిడ్యాల మండల కేంద్రంలో పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో సోమవారం నాడు ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడా పోటీలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథులుగా ఆంధ్ర ప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరయ్యారు... ఈ సందర్భంగా సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ తన చిన్నతనంలో మరి నుండి ఆటలు ఆడేందుకు పగిడ్యాల కు ఇచ్చేవారని ఈరోజు స్కూల్ గ్రౌండ్ లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించేందుకు ముఖ్యఅతిథిగా రావడం చాలా సంతోషకరమైన విషయమని మీ అందరి సహాయ సహకారాలతో ఈరోజు ఆంధ్ర ప్రదేశ్ షాప్ చైర్మెన్గా ఎన్నిక కావడం మీ అందరిని తీసుకోలేనని ఈ సందర్భంగా చేశారు. ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను సమానంగా తీసుకొని క్రీడ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ గ్రౌండ్లో 400 మంది క్రీడాకారులు ఆటలు ఆడుతారు అన్నారు. పగిడ్యాలకు కబడ్డీ మ్యాట్లు ఇచ్చేందుకు సహకరిస్తానని అన్నారు. అదే విధముగా ఎస్సై నాగార్జున వాటర్ స్పోర్ట్స్ కొరకు సహకరించాలని కొంతమందినీ స్విమ్మింగ్ వాటర్ స్పోర్ట్స్ తొ ముందుకు తీసుకువెళ్ళీ ఉద్యోగస్తులను చెయ్యొచ్చని సిద్ధార్థ రెడ్డిని ఎస్సై నాగార్జున కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి.జెడ్ పి టి సి పుల్యాల దివ్య. భూషీ రెడ్డి.పల్లె సత్యం రెడ్డి. పుల్యాల రామచంద్రారెడ్డి. బన్ను రాజశేఖర్రెడ్డి.పల్లె అరుణమ్మ. నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి. మార్కెట్ యార్డ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి. శ్రీ నంది విద్యాసంస్థల అధినేత శ్రీ కాంత్. భాస్కర్ రెడ్డి. సర్పంచ్ పేరుమళ్ళ శేషన్న. పగిడ్యాల మండల విద్యాశాఖ అధికారి సుభన్. ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు. ఏ పీ ఎం శ్రీనివాసులు. ఏ పీ ఓ ఖాసింసాహెబ్. బద్దుల రవి. క్రీడా అభివృద్ధి అధికారి పీతాంబర్ రెడ్డి. లక్ష్మాపురం సిరిగిరి వెంకట్. ఉస్మాన్ భాష. కుమ్మరి వెంకటేశ్వర్లు. కొణిదేల శ్రీకాంత్ రెడ్డి. కొంగర అయ్యన్న. కొంగర రాజేష్. కొంగర అనిల్. ముఖ్యంగా సీనియర్ పాత్రికేయులు వెంకటేశ్వర్లు క్రీడ క్రీడాభివృద్ధి క్రీడల గురించి గత 30 సంవత్సరాల నుండి ఎప్పుడెప్పుడు ఏమి జరిగింది. స్కూల్ గ్రౌండ్ లో జరిగినటువంటి పూర్వపు విద్యార్థులు క్రీడారంగంలో గాని ఉన్నతస్థాయి ఉద్యోగ రంగంలో గాని చాలా పెద్ద ఉన్నత స్థాయికి ఎదగాలని ముఖ్యంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కుటుంబ సభ్యులు మండలానికి తమ సొంత మండలం గా భావించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగింది... చిన్న వయసులో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో గుర్తింపు తెచ్చుకున్నారు.. చాలా హర్షించదగ్గ విషయమని కావున బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రత్యేక దృష్టితో మా పగిడ్యాల మండల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు...కొసమెరుపు ఈ సందర్బంగా ఆంధ్ర ప్రదేశ్ శాప్ స్పోర్ట్స్ చైర్మన్ సిద్ధార్థ రెడ్డి సీనియర్ పాత్రికేయులు గుంపుల వెంకటేశ్వర్లు రాజకీయంగా గాని. అభివృద్ధి పరంగా గాని.. తాత ముత్తాతల గురించి ప్రత్యేకంగా వివరించడం చాలా సంతోషకరమైన విషయం అని గుంపుల వెంకటేశ్వర్లు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

## అప్పట్లో చిరు.. ఇప్పుడు పవర్ స్టార్



వెండితెరపై లెక్చరర్ పాత్రలకు ఆ పాత్రల్లో స్టార్ హీరోలు నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాల్ని సొంతం చేసుకున్న రికార్డుంది. కొంత మంది స్టార్ లే ఈ తరహా పాత్రల్లో నటించినా అవి ఏ విషయంలోనూ స్టార్స్ తో పాటు వారి అభిమానుల్ని నిరుత్సాహ పరచలేదు. మంచి విజయాల్ని సొంతం చేసుకుని స్టార్ హీరోల కెరీర్ లో మంచి చిత్రాలుగా నిలిచిపోయాయి. ఈ విషయంలో ముందుగా చెప్పుకోవాల్సింది విక్టరీ వెంకటేష్ నటించిన 'సుందరాకాండ'. లెక్చరర్ స్టూడెంట్ మధ్య ప్రేమకథ నేపథ్యంలో ఈ సినిమాని రూపొందించారు.వెంకీ కెరీర్ లో గుడ్ మూవీగా నిలవడమే కాకుండా ఆడియో పరంగానే మంచి మార్కులు కొట్టేసింది. ఇక మెగాస్టార్ చిరంజీవి 1997లో నటించిన 'మాస్టర్' మూవీ కూడా మంచి హిట్ గా నిలిచి చిరు కెరీర్ ని మళ్లీ గాడిలో పెట్టింది. ఇందులో చిరు కనిపించిన తీరు పాత్రని మలిచిన తీరు అన్ని వర్గాల ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. సురేష్ కృష్ణ డైరెక్ట్ చేసిన ఈ మూవీ తెలుగులో అతనికి మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇక 'మిరపకాయ్' లో రవితేజ తనదైన మార్కు కామెడీతో స్టూడెంట్ పై మనసుపడే లెక్చరర్ గా నటించి ఆకట్టుకున్నాడు. హరీష్ శంకర్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ ఆడియో పరంగానూ మంచి హిట్ అనిపించుకుంది.నందమూరి బాలకృష్ణ 'సింహా'లో తొలి సారి లెక్చరర్ గా కనిపించిన విషయం తెలిసిందే. ఓ పాత్రలో సీరియస్ గా కనిపించిన బాలయ్య మరో పాత్రలో లెక్చరర్ గా కనిపించి అలరించారు. ఇప్పుడు ఇదే తరమాలో మెగా హీరో పవన్ కల్యాణ్ కూడా లెక్చరర్ గా కనిపించబోతున్నారట. 1997లో మెగాస్టార్ 'మాస్టర్' మూవీలో లెక్చరర్ గా తనదైన పంథాలో ఆకట్టుకుంటే అదే ఫార్ములాని పవర్ స్టార్ తన తాజా చిత్రం కోసం ఫాలో అవుతున్నారట.వివరాల్లోకి వెళితే.. హరీష్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ నిర్మించబోతున్న మూవీ 'భవదీయుడు భగత్ సింగ్'. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ గత కొంత కాలంగా వివిధ కారణాల వల్ల సెట్స్ పైకి వెళ్లడానికి సరైన సమయం కోసం ఎదురుచూస్తోంది. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ తండ్రీ కొడుకులుగా కనిపిస్తారని ఓ పాత్రలో లెక్చరర్ గా పవన్ ..భగత్ సింగ్ వీరభక్తుడిగా ఆయన భావాజాలంతో కనిపిస్తాడని ప్రచారం జరుగుతోంది. ఇటీవలే ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్వయంగా ఈ విషయాన్ని దర్శకుడు హరీష్ శంకర్ వెల్లడించడంతో ఈ వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది.ఆ కారణంగానే టైటిల్ ని పెట్టారని తెలిసింది. పవన్ ఇంత వరకు స్టూడెంట్ గానే కనిపించారు. అయితే తొలి సారి ఈ మూవీ కోసం లెక్చరర్ గా కనిపించబోతుండటం ప్రధాన్యతను సంతరించుకుంది.ఈ న్యూస్ విన్న పవన్ ఫ్యాన్స్ ఓ రేంజ్ లో హ్యాపీ ఫీలవుతున్నారట. జూలై లేదా ఆగస్టు నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని చెబుతున్నారు. ఇక సినిమాని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారట. హరీష్ శంకర్ - పవన్ ల కాంబినేషన్ లో ఇంతకు ముందు 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ మూవీ వచ్చిన విషయం తెలిసిందే.




## భాగ్యనగరంలో వాలిపోతున్న తమిళ హీరోలు..!

గత కొన్నేళ్లుగా హైదరాబాద్ మహా నగరం సినిమా షూటింగ్ లకు హబ్ గా మారిపోయింది. ఒక్క తెలుగు సినిమాలే కాదు ఇతర భాషలకు చెందిన ఎన్నో భారీ ప్రాజెక్టులు షూటింగ్స్ కోసం భాగ్యనగరానికి విచ్చేస్తున్నారు.ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన రామోజీ ఫిల్మ్ సిటీ - అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్ - రామానాయుడు స్టూడియో వంటి భారీ స్టూడియోలు అందుబాటులో ఉన్నాయి. పెద్ద పెద్ద సెట్లు వేసుకోడానికి అత్యుత్తమ పరికరాలు.. షూటింగ్ కు అనువైన ప్రదేశాలు - సౌకర్యాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఇతర ఇండస్ట్రీల నుంచి ఫిలిం మేకర్స్ అందరూ హైదరాబాద్ లో వాలిపోతున్నారు. ఇటీవలి కాలంలో అనేక తమిళ చిత్రాల షూటింగ్స్ ఇక్కడే జరిగాయి. దీంతో కోలీవుడ్ స్టార్స్ అందరూ నగరంలో సందడి చేస్తున్నారు.తలపతి విజయ్ హీరోగా



టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి తెరకెక్కిస్తున్న ద్విభాషా చిత్రం షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ 7 ఏకర్స్ లో జరుగుతోంది. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ కోసం 5 కోట్లతో ఓ భారీ సెట్ వేశారని సమాచారం. గత రెండు వారాలుగా అక్కడే ఈ షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటుంది. ఈ క్రమంలో ఇటీవల తెలంగాణ సీఎం కేసీఆర్ తో విజయ్ భేటీ అయిన సంగతి తెలిసిందే.' చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తుండగా.. శ్రీకాంత్ - సంగీత - జయసుధ - ప్రభు - శరత్ కుమార్ - 'కిక్' శ్యామ్- యోగిబాబు తదితరులు నటిస్తున్నారు. ఎస్ఎస్ థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమాతో విజయ్ టాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తున్నారు.మరో తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ నటిస్తున్న 61వ సినిమా షూటింగ్ ని ఇటీవల హైదరాబాద్ లోనే ప్రారంభించారు. ప్రస్తుతం అల్యూమినియం ఫ్యాక్టరీలో చిత్రీకరణ జరుపుకుంటుంది. హెచ్ వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని బోనీ కపూర్ నిర్మిస్తున్నారు. ఇందులో అజిత్ సరసన మంజు వారియర్ హీరోయిన్ గా నటిస్తోంది.టాలెంటెడ్ హీరో ధనుష్ నటిస్తున్న తెలుగు తమిళ ద్విభాషా చిత్రం "సార్" షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలోని ఉషా మయూరి థియేటర్లో జరుగుతోంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ - త్రివిక్రమ్లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ధనుష్ టాలీవుడ్ లో అడుగుపెడుతున్నారు. ఇందులో సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తోంది.అలానేమరో తమిళ హీరో శివ కార్తికేయన్ డెబ్యూ తెలుగు మూవీ షూటింగ్ నానక్ రామ్ గూడ లోని రామానాయుడు స్టూడియోలో జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు ఈ షెడ్యూల్ జరుగనుందని సమాచారం. 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ కేవీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు.

## వాళ్లందరికీ అవకాశం.. మీరు పశ్చాత్తాపపడక తప్పదు: టీమిండియా మాజీ బ్యాటర్



దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు బీసీసీఐ జట్టును ఎంపిక చేసిన తీరుపై టీమిండియా మాజీ బ్యాటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా పెదవి విరిచాడు. 18 మందితో కూడిన జట్టుతో ఆశించిన ఫలితాలు రాబట్టగలరా అని సందేహం వ్యక్తం చేశాడు. ముఖ్యంగా ఐదుగురు ఫాస్ట్‌బౌలర్లు, నలుగురు స్పిన్నర్లను ఎంపిక చేయడం బాగానే ఉన్నా.. వారందరికీ అవకాశం ఇవ్వడం సాధ్యపడుతుందా అని ప్రశ్నించాడు.వచ్చే నెల(జూన్) సొంతగడ్డపై టీమిండియా దక్షిణాఫ్రికా ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ఆదివారం ప్రకటించారు. రోహిత్ శర్మ గైర్హాజరీలో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ టీమిండియాకు సారథ్యం వహించనున్నాడు.ఐపీఎల్-2022లో ప్రదర్శన ఆధారంగా ఉమ్రాన్ మాలిక్, అర్ష్‌దీప్ తొలిసారి జట్టులో చోటు దక్కించుకోగా.. హార్దిక్ పాండ్యా, దినేశ్ కార్తిక్ వంటి సీనియర్లు పునరాగమనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో జట్టు ఎంపిక తీరుపై ఆకాశ్ చోప్రా యూట్యూబ్ వేదికగా తన అభిప్రాయాలు పంచుకున్నాడు. "18 మంది సభ్యుల జట్టును సెలక్ట్ చేశారు. ఇందులో ఐదుగురు ఫాస్ట్ బౌలర్లు, నలుగురు స్పిన్నర్లు ఉన్నారు.ఇంతపెద్ద జట్టును ఎంపిక చేసినపుడు మీరు ప్రతి ఒక్కరికి అవకాశం ఇవ్వలేరు కదా! ఈ విషయంలో మీరు పశ్చాత్తాపపడక తప్పదు. కళ్ల ముందు ఎన్నో ఆప్షన్లు కనిపిస్తాయి. కానీ ఏదీ ట్రై చేసే అవకాశం రాకపోవచ్చు" అని సెలక్టర్లను ఉద్దేశించి ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించాడు. అయితే, కోవిడ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ జట్టును ఎంపిక చేశారనుకున్నా.. ఇప్పుడు పరిస్థితులు కాస్త బాగానే ఉన్నాయి కదా అని పేర్కొన్నాడు.అదే విధంగా.. "దినేశ్ కార్తిక్, హార్దిక్ పాండ్యా.. ఈ ఇద్దరు ముఖ్యమైన ఆటగాళ్లకు జట్టులో స్థానం ఇచ్చారు. ఐపీఎల్‌లో ప్రదర్శన ఆధారంగా చాలా రోజుల తర్వాత డీకే పునరాగమనం చేయబోతున్నాడు. అయితే, అతడికి తుది జట్టులో చోటు దక్కదనిపిస్తోంది" అని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు.

## మ్యాచ్ జరుగుతుండగానే ఛాతి నొప్పి.. హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు సందర్భంగా శ్రీలంకకు భారీ షాక్ తగిలింది. లంక స్టార్ బ్యాటర్ కుశాల్ మెండిస్ ఛాతిలో నొప్పితో మైదానాన్ని వీడాడు. నొప్పి తీవ్రతరం కావడంతో ఈ వికెట్ కీపర్ బ్యాటర్‌ను ఢాకాలోని ఆస్పత్రిలో చేర్పించినట్లు సమాచారం. కాగా రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం లంక బంగ్లాదేశ్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. తొలి టెస్టు డ్రాగా ముగియగా.. సోమవారం (మే 23) రెండో టెస్టు ఆరంభమైంది. టాస్ గెలిచిన బంగ్లాదేశ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో మ్యాచ్ 23వ ఓవర్ సమయంలో 27 ఏళ్ల కుశాల్ ఛాతి నొప్పితో విలవిల్లాడాడు.దీంతో వెంటనే అతడిని మైదానం వెలుపలికి తీసుకువెళ్లారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190